ఇక వీరమల్లు వంతు..

'హరిహర వీరమల్లు' సినిమాకు సంబంధించిన అప్‌డేట్ కోసం పవన్ కల్యాణ్ అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. తాజాగా వారి కోసం నిర్మాణ సంస్థ ఓ గుడ్‌న్యూస్‌ను పంచుకుంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన వీఎఫ్‌ఎక్స్ వర్క్ జరుగుతున్నదని, త్వరలో స్పెషల్ ప్రోమోను విడుదల చేస్తామని ప్రకటించింది. 'ప్రస్తుతం ఇరాన్, కెనడా, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లో గ్రాఫిక్స్ వర్క్స్ జరుపుతున్నాం. అందరి అంచనాలకు మించి ఈ సినిమా ఉంటుంది. నిర్మాణ విలువలు మరో స్థాయిలో ఉంటాయి' అని చిత్ర బృందం ప్రకటనలో పేర్కొంది. క్రిష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఏ.ఎం.రత్నం సమర్పణలో దయాకర్‌రావు నిర్మిస్తున్నారు. పదిహేడవ శతాబ్దానికి చెందిన మొఘలాయిలు, కుతుబ్‌షాహీల శకం నేపథ్యంలో జరిగే కథ ఇది. ఇందులో అన్యాయాలపై పోరాటం చేసే బందిపోటు వీరమల్లు పాత్రలో కనిపించనున్నారు పవన్‌కల్యాణ్. పాన్ ఇండియా స్థాయిలో రానున్న ఈ చిత్రానికి ఎం.ఎం.కీరవాణి సంగీతాన్నందిస్తున్నారు. ఇటీవల పవన్‌కల్యాణ్ తాజా చిత్రం 'ఓజీ' నుంచి వచ్చిన కొత్త పోస్టర్ అభిమానులను ఆకట్టుకుంది. ఈ నేపథ్యంలో 'హరిహరవీరమల్లు' తాజా అప్‌డేట్‌తో అభిమానులు మరింత హ్యాపీగా ఫీలవుతున్నారు.

పెండ్లి ముహూర్తం ఖరారు

అగ్ర కథానాయిక రకుల్‌ప్రీత్‌సింగ్ పెళ్లిపీటలెక్కబోతున్నది. బాలీవుడ్ నిర్మాత జాకీ భగ్నానీతో ఈ భామ నాలుగేళ్లుగా ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. వీరి ద్దరి వివాహం ఈ నెల 21న గోవాలో జరగనుంది. ఈ వేడుకకు కుటుంబ సభ్యులతో పాటు పలువురు బాలీవుడ్ ప్రముఖులు హాజరుకాబోతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో వీరి పెళ్లికి సంబంధించిన ఆహ్వాన పత్రిక సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దాదాపు మూడు రోజుల పాటు వైభవంగా ఈ పెళ్లి వేడుకను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది. బాలీవుడ్ పరిశ్రమకు చెందిన డిజైనర్లు సబ్యసాచి, తరుణ్ తహిల్యానీ, మనీష్ మల్హోత్రా పెళ్లి దుస్తులను డిజైన్ చేశారని తెలిసింది. 'మహిళ ఎప్పటికైనా తన పుట్టినిల్లు నుంచి మరొక ఇంటికి వెళ్లాల్సిందే. ఈ మార్పును అంగీకరించి స్వాగతించాలి. మనం ఎంత పాజిటివ్‌గా ఆలోచిస్తే అంత మంచి జరుగుతుంది' అంటూ రకుల్‌ప్రీత్‌సింగ్ తన పెళ్లి గురించి చెప్పింది. ప్రస్తుతం ఆమె తెలుగులో పాటు దక్షిణాది భాషల్లో మంచి అవకాశాలతో దూసుకుపోతున్నది.

హరీష్‌శంకర్, వివేక్ కూచిభొట్ల, టీజీ విశ్వప్రసాద్, రవితేజ, కావ్యథాపర్, అవసరరాల శ్రీనివాస్, కార్తీక్

కార్తీక్ కచ్చితంగా పెద్ద డైరెక్టర్ అవుతాడు

'కార్తీక్ కథ చెప్పినప్పుడే నా పాత్రకి చాలా ఎక్సయిట్ అయ్యాను. నా కేరక్టర్ మేకోవర్‌కి చాలా మంచి ప్రశంసలు వస్తున్నాయి. డేవ్ జాండ్ సంగీతం, మణి మాటలు, అనుపమ పరమేశ్వరన్ అభినయం, కావ్యథాపర్ అందం.. ఇవన్నీ ఈ సినిమాకు కలిసొచ్చాయి. కార్తీక్ అద్భుతమైన విజన్ ఉన్న దర్శకుడు. కచ్చితంగా పెద్ద డైరెక్టర్ అవుతాడు' అన్నారు రవితేజ. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'ఈగల్'. కార్తీక్ ఘట్టనమేని దర్శకుడు. టీజీ విశ్వప్రసాద్ నిర్మాత. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం సక్సెమీట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడారు. యాక్షన్ సినిమా చేయాలనే కోరిక ఈ సినిమాతో తీరిందని, అర్థవంతమైన మాస్ సినిమాను తీసే అవకాశం ఇచ్చిన రవితేజకు థ్యాంక్స్ చెప్పుకుంటున్నానని దర్శకుడు తెలిపారు. 'ధమాకా' తర్వాత రవితేజలో మరో బ్లాక్‌బాస్టర్ ఇచ్చినందుకు చాలా ఆనందంగా ఉందని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఆనందం వ్యక్తం చేశారు. 'ఈగల్'లాంటి పాయింట్‌ని ఇంత అద్భుతంగా తీయడం కార్తీక్‌కే సాధ్యపడిందని దర్శకుడు హరీశ్‌శంకర్ అభినందించారు. బ్లాక్‌బాస్టర్ సక్సెస్‌లో భాగం అయినందుకు ఆనందంగా ఉందని కావ్యథాపర్ సంతోషం వ్యక్తం చేశారు. ఇంకా చిత్రయూనిట్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సామజవరగమనా దర్శకుడితో..

2022లో వచ్చిన 'ఒకే ఒక జీవితం' తర్వాత శర్వానంద్ నుంచి ఒక్క సినిమా కూడా రాలేదు. గత ఏడాది జూన్‌లో ఆయన వివాహం జరిగింది. ఈ విరామానికి ఆ వివాహం కూడా ఓ కారణం కావొచ్చు. ఇప్పుడు మళ్లీ సినిమాలతో బిజీ అయ్యే పనిలో ఉన్నారాయన. ప్రస్తుతం శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో ఓ చిత్రం చేస్తున్న శర్వా.. 'సామజవరగమనా' చిత్ర దర్శకుడు రామ్ అబ్బరాజు కథకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. వచ్చే నెలలోనే ఈ చిత్రం షూటింగ్ కూడా మొదలుకానుందని తెలిసింది. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో వచ్చిన 'సామజవరగమనా' ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. గత ఏడాది అద్భుత విజయాల్లో ఆ సినిమా ఒకటి. శర్వాతో చేయనున్న కథ కూడా ప్రేమ, భావోద్వేగాల సమ్మేళనంగా ఉంటుందని సమాచారం. అలాగే రామ్ అబ్బరాజు మార్క్ హ్యూమర్ కూడా ఇందులో ఉంటుందని వినికిడి. ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు తెలియాల్సివుంది.

మైథలాజికల్ అంశాలతో కూడిన కథ 'ఊరుపేరు భైరవకోన'

'సందీప్‌కిషన్ ఇప్పటివరకూ సూపర్ నేచురల్ ఫాంటసీ జానర్ చేయలేదు. ఆయనకి ఈ కథ కచ్చితంగా డిఫరెంట్‌గా ఉంటుంది. విజువల్స్, సౌండ్ పరంగా ఆడియన్స్‌కు అద్భుతమైన ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా 'ఊరు పేరు భైరవకోన' అన్నారు దర్శకుడు వి.ఐ.ఆనంద్. హాస్య మూవీస్ పతాకంపై రాజేశ్ దండా నిర్మిస్తున్న ఈ చిత్రంలో సందీప్‌కిషన్, కావ్య థాపర్, వర్ష బొల్లమ్మ ప్రధాన పాత్రధారులు. ఈ నెల 16న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు వి.ఐ.ఆనంద్ విలేకరులతో ముచ్చటించారు. ''డిస్కోరాజా' తర్వాత రెండు కథలు రాసుకున్నాను. రెండూ సందీప్‌కిషన్‌కి చెప్పాను. 'ఊరుపేరు భైరవకోన' కథ విని తను చాలా ఎక్సయిట్ అయ్యాడు. ట్రెండ్ సెట్‌చేసే కథ అవుతుందని సంబరపడిపోయాడు. కథను నమ్మి ఈ సినిమాతో నిర్మాతగా మారారు రాజేశ్ దండ' అని తెలిపారు వి.ఐ.ఆనంద్. కర్మ సిద్ధాంతం, గరుడపురాణం, శివదండం లాంటి మైథలాజికల్ అంశాలతో కూడిన కథ ఇదని, అందుకే 'ఊరుపేరు భైరవకోన' అనే టైటిల్‌ని ఈ సినిమాకు పెట్టామని ఆయన అన్నారు. ఖర్చు విషయంలో రాజీ పడకుండా, అలాగే వృథా చేయకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకొని ఈ సినిమా చేశామని, కంటెంట్, విజువల్ ఎక్స్‌పీరియన్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని, యువతరంతోపాటు కుటుంబప్రేక్షకులకు కూడా కనెక్టయ్యే సినిమా ఇదని వి.ఐ.ఆనంద్ పేర్కొన్నారు. కథ, కథనాలతోపాటు సందీప్ నటన, వెన్నెల కిశోర్, వైవా హర్ష కామెడీ, కావ్యాథాపర్, వర్ష బొల్లమ్మ అందచందాలు ఈ సినిమాకు ప్రధాన బలాలని, సందీప్‌కి మంచి బ్రేక్‌ని ఇచ్చే సినిమా ఇదని, సాంకేతికంగా కూడా నెక్ట్స్ లెవల్లో ఉంటుందని వి.ఐ.ఆనంద్ చెప్పారు. నిఖిల్‌తో చేసే సినిమా చర్చల దశలో ఉందని, అలాగే ఓ పెద్ద హీరోకి కథ రాస్తున్నానని ఆయన తెలిపారు.

నవ్వులు పూయించే 'చారి 111'

వెన్నెల కిశోర్ హీరోగా నటించిన సినిమా 'చారి 111'. సంయుక్తా విశ్వనాథన్ హీరోయిన్. టీజీ కీర్తికుమార్ దర్శకుడు. బర్కత్ స్టూడియోస్ పతాకంపై అదితి సోనీ నిర్మించారు. మార్చి 1న విడుదల కానున్న ఈ చిత్రం ట్రైలర్ సోమవారం ఆవిష్కరించారు. ట్రైలర్ జస్ట్ శాంపిల్ మాత్రమేనని, సినిమాలో మరింత రెట్టింపు వినోదం ఉంటుందని దర్శక నిర్మాతలు తెలిపారు. ప్రేక్షకుల్ని 'చారి 111' కడుపుబ్బా నవ్విస్తుందని చెప్పారు. మురళీశర్మ, బ్రహ్మజీ, సత్య, రాహుల్ రవీంద్రన్, పావనిరెడ్డి, తాగుబోతు రమేశ్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు కెమెరా: కషిష్ గ్రోవర్, సంగీతం: సైమన్ కె కింగ్, సాహిత్యం: రామజోగయ్యశాస్త్రి.



డైనమిక్ తాన్యశర్మగా.. రుహానీ శర్మ

వరుణ్‌తేజ్ హీరోగా రూపొందుతోన్న పాన్ ఇండియా చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. ప్రమోషన్‌లో భాగంగా విడుదల చేసిన పాటలు, ప్రచార చిత్రాలతో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని అందుకున్నాయి. ఇందులో వరుణ్ ఐఏఎఫ్ అధికారిగా నటిస్తుండగా, రాడార్ ఆఫీసర్‌గా మానుషి చిల్లర్ కనిపించనున్నది. మంచినటిగా గుర్తింపు తెచ్చుకున్న రుహానీశర్మ కూడా ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నట్టు మేకర్స్ తెలియజేశారు. ఈ సినిమాలో ఆమె పేరు తాన్యశర్మ. ఆ పాత్ర లుక్‌ని కూడా మేకర్స్ విడుదల చేశారు. ఎయిర్‌ఫోర్స్ పైలెట్ యూనిఫాంలో డైనమిక్‌గా ఆమె ఈ లుక్‌లో కనిపిస్తున్నదని, సినిమాలో పాత్ర కూడా అదే స్థాయిలో ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. దేశంకోసం వైమానిక దళ వీరుల అలుపెరగని పోరాటాన్ని 'ఆపరేషన్ వాలెంటైన్' చూపించబోతున్నామని వారు తెలిపారు. శక్తిప్రతాప్‌సింగ్ హడా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, సందీప్ ముద్దా రినైసన్స్ పిక్చర్స్ కలిసి నిర్మిస్తున్నారు. మార్చి 1న ఈ సినిమా విడుదల కానుంది.

మురుగదాస్ దర్శకత్వంలో...

ప్రస్తుతం బాలీవుడ్‌లో యాక్షన్ సినిమాల హవా నడుస్తున్నది. పఠాన్, జవాన్ చిత్రాలు గత ఏడాది బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించాయి. ఈ నేపథ్యంలో అగ్ర హీరోలు యాక్షన్ బాట పడుతున్నారు. ఈ క్రమంలో బాలీవుడ్ కండలవీరుడు సల్మాన్ ఖాన్ ఓ పాన్ ఇండియా యాక్షన్ మూవీ కోసం సిద్ధమవుతున్నట్లు తెలిసింది. బాలీవుడ్‌లో తన సన్నిహిత మిత్రుడు సాజిద్ నదియావాలా నిర్మించే ఈ చిత్రానికి మురుగదాస్ దర్శకత్వం వహించబోతున్నారు. ఈ ప్రాజెక్ట్ సంబంధించి గత రెండేళ్లుగా మురుగదాస్, సాజిత్ నదియావాలా మధ్య చర్చలు నడుస్తున్నాయని, ఇటీవల స్క్రిప్ట్ ఫైనలైజ్ చేశారని బాలీవుడ్‌లో వినిపిస్తున్నది. గత కొంతకాలంగా బాలీవుడ్‌లో కమ్‌బ్యాక్ కోసం ఎదురుచూస్తున్న దర్శకుడు మురుగదాస్ ఈ సినిమా కోసం పవర్‌ఫుల్ యాక్షన్ కథను సిద్ధం చేశారని తెలిసింది. ఈ వేసవిలో సెట్స్‌పైకి వెళ్లనున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది రంజాన్ సందర్భంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారని సమాచారం.

'లవ్ యువర్ ఫాదర్' ప్రారంభం



ఎస్పీ చరణ్, శ్రీహర్షలపై క్లాప్‌నిస్తున్న గోపాల్ రెడ్డి

శ్రీహర్ష, కషిక కపూర్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'లవ్ యువర్ ఫాదర్'. మనీషా ఆర్ట్స్ అండ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, అన్నపరెడ్డి స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. పవన్ కేతరాజు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా పూజా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మల్లారెడ్డి కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ విద్యాసంస్థల నిర్వాహకురాలు చామకూర శాలిని కెమెరా స్విచ్ ఆన్ చేయగా, సీఎంఆర్ గ్రూప్ చైర్మన్ గోపాల్‌రెడ్డి క్లాప్ కొట్టారు. తండ్రీకొడుకుల బంధం, భావోద్వేగాలను ఈ సినిమాలో సరికొత్తగా చూపించనున్నామని నిర్మాత మహేశ్ రాఠీ తెలిపారు. ప్రతి ఒక్కరికి తాను నమ్ముకున్న దేవుడి తర్వాతి స్థానం తండ్రిదేనని, తన తండ్రి ఆశీస్సులు ఎప్పుడూ తనతో ఉంటాయని చెప్పారు. కిశోర్ రాఠీ గారి జీవితంలోని చిన్న సంఘటనను తీసుకొని దాన్ని డెవలప్ చేసుకొని తండ్రీకొడుకుల ఎమోషనల్ జర్నీగా ఈ సినిమాను తెరకెక్కించామని దర్శకుడు తెలిపారు. 'శివోహం' లాంటి మంచి కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ సినిమాలో ఎస్పీ చరణ్, నవాబ్ షా, ప్రవీణ్, భద్రం, అంజన్ శ్రీవాస్తవ్, అమన్ వేమ కూడా నటిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: మణీంద్ర కుమార్, సంగీతం: మణిశర్మ, నిర్మాతలు: కిశోర్ రాఠీ, మహేశ్ రాఠీ, అన్నపురెడ్డి సామ్రాజ్యలక్ష్మి, దర్శకత్వం: పవన్ కేతరాజు.

'ఊ అంటావా'కు మించేలా

ఈ మధ్య వచ్చిన ఐటమ్ సాంగ్స్‌లో ది బెస్ట్ అంటే.. 'పుష్ప'లోని 'ఊ అంటావా మావా.. ఉ..ఉ.. అంటావా మావా..' పాటే అనాలి. ఆ పాటలో సమంత స్క్రీన్ ప్రెజన్స్ మామూలుగా ఉండదు. తన అందంతో అభినయంతో యువతరాన్ని ఉర్రూతలూగించింది. సమంత. దేవిశ్రీ సంగీతం, ఇంద్రావతి స్వరం, చంద్రబోస్ సాహిత్యం ఈ పాటను మరోస్థాయికి తీసుకెళ్లాయని చెప్పాలి. మరి ఆనవాయితీ ప్రకారం 'పుష్ప2'లో కూడా ఇలాంటి ఐంటమ్ నంబర్ ఒకటి ఉండాలికదా. అది కూడా తొలి పార్ట్‌లోని ఐటమ్‌నంబర్‌కి ఏ మాత్రం తగ్గని స్థాయిలో ఉండాలి. అందుకే దిశా పటానీని ఎంపిక చేశారు సుకుమార్. తొలి పార్ట్‌లోని పాటను మించేలా అద్భుతమైన గీతాన్ని దేవిశ్రీ స్వరపరిచినట్టు విశ్వసనీయ సమాచారం. ఈ వారంలోనే దిశాతో ఐటమ్‌సాంగ్ చిత్రీకరించనున్నారు సుకుమార్. ఇక దిశా పటానీ విషయానికొస్తే.. ఆమె తొలి సినిమా పూరీజగన్నాథ్ 'లోఫర్'. ఆ సినిమా తర్వాత బాలీవుడ్‌లో ఎం.ఎస్.ధోనీ, బాగీ2, బాగీ3, ఏక్ విలన్ రిటర్న్స్ తదితర చిత్రాల్లో నటించి అనతికాలంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. త్వరలో విడుదల కానున్న ప్రభాస్ 'కల్కి 2898 ఏ.డి', సూర్య 'కంగువ' చిత్రాల్లో కూడా మంచి పాత్రలు పోషిస్తున్న దిశా పటానీ.

రెండు విభిన్న పాత్రలు పోషించాను

'పొన్నియన్ సెల్వన్' సినిమాతో తెలుగులో మంచి ఆదరణ పొందిన హీరో జయం రవి. ఆయన కథానాయకుడిగా వస్తున్న మరో చిత్రం 'సైరన్'. కీర్తి సురేశ్, అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్లు. ఈ మాస్ ఎంటర్‌టైనర్‌ను గంగ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ తెలుగులో ఈ నెల 23న విడుదల చేస్తున్నది. ఈ సందర్భంగా హీరో మాట్లాడుతూ 'ఈ చిత్రంలో ఎమోషన్స్ చాలా ముఖ్య పాత్రలు వహిస్తాయి. వాటికి జి.వి తన సంగీతంతో ప్రాణం పోశాడు. ఈ చిత్రంలో నేను రెండు విభిన్న పాత్రలు పోషించాను' అని అన్నారు. దర్శకుడు ఆంథోనీ భాగ్యరాజ్ మాట్లాడుతూ 'ఈ చిత్రం నాకొక కలలా సాగింది. ఒక కొత్త దర్శకుడి మొదటి చిత్రం.. అదీ పెద్ద హీరోతో అయినప్పుడు కచ్చితంగా హిట్ కావాలని కోరుకుంటాం. ఆ బాధ్యత జయం రవి గారు తీసుకున్నారు. తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుందని ఆశిస్తున్నాం' అన్నారు. ఈ సినిమా మిగతా ముఖ్య తారాగణం: సముద్ర ఖని, యోగిబాబు, అజయ్, అలగం పెరుమాళ్, పాండ్యన్, నిర్మాత: సుజాత విజయ్‌కుమార్, రచన-దర్శకత్వం: ఆంథోనీ భాగ్యరాజ్.

దేశభక్తి కథాంశంతో..

యువ హీరో శివకార్తికేయన్ కథానాయకుడిగా రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్ పతాకాలపై ఓ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సాయిపల్లవి కథానాయిక. తాజాగా ఈ సినిమా టైటిల్ టీజర్‌కు సంబంధించి అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఎస్‌కే21 టైటిల్ టీజర్‌ను 16న విడుదల చేయనున్నట్లు తెలుపుతూ ఓ వీడియోను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. ఈ వీడియోలో జిమ్‌లో ఇంటెన్స్ వర్కౌట్స్ చేస్తూ కనిపించిన శివకార్తికేయన్‌ను ఈ సినిమాలో గతంలో ఎప్పుడూ చూడని విధంగా చూడొచ్చు. డిఫరెంట్ గన్స్‌ను ఫైర్ చేస్తూ కనిపించడం సినీ ప్రియుల్లో ఆసక్తిని పెంచుతోంది. దేశభక్తి కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రానికి జి.వి. ప్రకాశ్ సంగీతం సమకూరుస్తున్నారు. దీనికి సినిమాటోగ్రాఫర్: సీహెచ్ సాయి, నిర్మాతలు: కమల్ హాసన్, ఆర్.మహేంద్రన్, రచన-దర్శకత్వం: రాజ్‌కుమార్ పెరియసామి.